తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం.
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ



తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
రాజమహేంద్రవరం | సోమవారం 26 అక్టోబర్ 2026 | I

# పాపికొండల పర్యటనకు తాత్కాలిక విరామం!

**తుఫాను నేపథ్యంలో పోచవరం ఫెర్రీ పాయింట్ వద్ద బోట్ల నిలిపివేత**

**అక్టోబర్ 26 నుంచి తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు నిషేధం**

**ప్రయాణికుల భద్రత కోసమే ముందస్తు చర్యలు: సబ్ కలెక్టర్ నరేంద్ర పడాల్**

**చింతూరు, అక్టోబర్ 25 (ప్రభాత వార్త):** 'అర్నబ్' తుఫాను హెచ్చరికల నేపథ్యంలో పాపికొండల పర్యాటక బోట్ల యాత్రకు తాత్కాలికంగా విరామం ప్రకటించారు. గోదావరి నదిలో నీటిమట్టం పెరిగే అవకాశం, ప్రతికూల వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పోచవరం ఫెర్రీ పాయింట్ వద్ద బోట్ల నిర్వహణను అక్టోబర్ 26 నుంచి తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకు నిలిపివేస్తున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, చింతూరు సబ్ కలెక్టర్, సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ చిట్టపులి నరేంద్ర పడాల్ ఆదివారం వెల్లడించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుఫానుగా బలపడే అవకాశం ఉందని, ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతంతో పాటు గోదావరి పరివాహక ప్రాంతంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని ఆయన తెలిపారు. ప్రయాణికుల భద్రతను



దృష్టిలో ఉంచుకుని ముందస్తు జాగ్రత్తగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఇన్‌ల్యాండ్ వెసెల్స్ చట్టం, 1917కు అనుగుణంగా రూపొందించిన నిబంధనల ప్రకారం ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. బోటు యజమానులు, నిర్వాహకులు, సంబంధిత అధికారులు ఉత్తర్వులను తప్పనిసరిగా పాటించాలని, తదుపరి ఆదేశాలు వచ్చే వరకు పోచవరం ఫెర్రీ పాయింట్ వద్ద ఎలాంటి బోటింగ్ కార్యకలాపాలు నిర్వహించరాదని సబ్ కలెక్టర్ స్పష్టం చేశారు.

## తుఫాన్ హెచ్చరికలు నేపథ్యంలో

# యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి...

**రెవెన్యూ డివిజనల్ అధికారి మల్లిబాబు**

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 25,ప్రభాతవార్త.** ఆర్నాబ్ తుఫాన్ హెచ్చరిక లు నేపథ్యంలో కాకినాడ రెవెన్యూ డివిజనల్ అధికారి. ఎస్ మల్లిబాబు తహసీల్దార్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 27 28వ తేదీ నాటికి తుఫాను తీవ్ర రూపం దాల్చి కాకినాడ వద్ద తీరం దాటవచ్చున్న హెచ్చరికల నేపథ్యంలో రెవెన్యూ పంచాయతీ పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండి గ్రామస్థాయిలో ప్రజానీకాన్ని ఎప్పటికప్పుడు చేయాలని ముఖ్యంగా తీర ప్రాంతం మండలాలైన ఉప్పాడ, కొత్తపల్లి. కాకినాడ రూరల్. కాకినాడ అర్బన్ మరియు కరప తాళ్ళరేవు మండలాల్లో సిబ్బంది కంట్రోల్ రూమ్ ఓపెన్ చేసి నిరంతరం పర్యవేక్షించాలని ముఖ్యంగా ఈదురు గాలులకు చెట్లు విరిగిన నేపథ్యంలో అవసరమైన రంపం మిషన్లు అగ్నిమాపక సిబ్బంది వద్ద అందుబాటులో ఉంచడమైనదని. ముఖ్యంగా త్రాగునీరు ఆసుపత్రులు మొబైల్ టవర్లకు అవసరమైన చమురు నిలవలు సిద్ధం చేసుకోవాలని, మండలాల్లో గల ప్రభుత్వ స్కూళ్లను తమ ఆధీనంలోకి తీసుకోవాలని ఆదేశించారు. ఆహారం. త్రాగునీరు విద్యుత్ సౌకర్యాలకు ఆటంకం లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు ఎటువంటి విపత్కర పరిస్థితి నైనా ఎదుర్కొనేందుకు సన్నద్ధంగా సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.

## భక్తులతో కిటకిటలాడిన

# వాడపల్లి వెంకన్న ఆలయం..

**ఈ నెల 29 నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు.. అన్నదానానికి రూ.1.16 లక్షల విరాళం**

**అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ కమిషనర్ ఈఓ, నల్లం**







**ఆత్రేయపురం, అక్టోబర్,25,(ప్రభాత వార్త)** ఏడువారాల వెంకన్నగా ప్రసిద్ధిగాంచిన కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయం ఆదివారం వేలాది మంది భక్తులతో కిటకిటలాడింది. ఏడు వారాల నోములు పూర్తిచేసుకున్న భక్తులు అష్టోత్తర శతనామావళి, నిత్య కల్యాణం, గోపూజ తదితర కార్యక్రమాల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ నెల 29 నుంచి నవంబర్ 6వ తేదీ వరకు ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రతిరోజూ నిర్వహించే అష్టోత్తర పూజలు, శ్రీ వేంకటేశ్వర ఐశ్వర్య లక్ష్మీ హోమాలు, కల్యాణోత్సవాలను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. సుప్రభాత సేవను ఏకాంతంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. భక్తులు ఈ మార్పులను గమనించి సహకరించాలని కోరారు. అనంతరం ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించిన ఆయన, వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. విజయవాడకు చెందిన మంద విజయ శేఖర రెడ్డి, మంద సతీష్ రెడ్డి, వారి కుటుంబ సభ్యులు ఆలయ నిత్యాన్నదాన పథకానికి రూ.1,16,116 విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా అర్చకులు దాతలకు స్వామివారి దర్శనం చేయించి వేద ఆశీర్వచనాలు అందించారు. డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు, ధర్మకర్తల మండలి సభ్యుడు వాడపల్లి సుందర శేషావతారం స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను దాతలకు అందజేశారు.

# అర్నబ్ తుఫానుపై అప్రమత్తంగా ఉండాలి

- **భారీ వర్షాలు కురిసే అవకాశం.గంటకు 125 కి.మీ. వేగంతో గాలులు.. 140 కి.మీ. వరకు ఈదురుగాలులు వీచే అవకాశం**
- **లోతట్టు ప్రాంతాల ప్రజలను తరలించేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలి**
- **24 గంటల కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలి: పోలవరం జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్**

**పోలవరం జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 25 (ప్రభాత వార్త):** 'అర్నబ్' తుఫాను, భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలోని అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండి ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ ఆదేశించారు. ఆదివారం సాయంత్రం నిర్వహించిన అత్యవసర జూమ్ సమావేశంలో తుఫాను సన్నద్ధత, ప్రజల భద్రత, సహాయక చర్యలపై అధికారులతో సమీక్షించారు.

వాతావరణ శాఖ అంచనాల ప్రకారం అక్టోబర్ 27, 28 తేదీల్లో అత్యంత భారీ వర్షాలు, 29న భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. తుఫాను ప్రభావంతో గంటకు 115--125 కిలోమీటర్ల వేగంతో గాలులు, గరిష్ఠంగా 140 కిలోమీటర్ల వరకు ఈదురుగాలులు వీచే అవకాశమున్నందున ప్రత్యేక అప్రమత్తత అవసరమని సూచించారు.



లోతట్టు ప్రాంతాలు, వరద ముప్పు ఉన్న గ్రామాలు, కొండవాగులు, కట్‌ఆఫ్ ప్రాంతాలను ముందుగానే గుర్తించి, అవసరమైతే ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. కేంద్రాల్లో తాగునీరు, ఆహారం, విద్యుత్, వైద్యం, పారిశుధ్య సదుపాయాలు సిద్ధంగా ఉంచాలన్నారు. జిల్లా కలెక్టరేట్‌తోపాటు రంపచోడవరం, చింతూరు సబ్ కలెక్టర్ కార్యాలయాలు, అన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో 24 గంటల కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి, సిబ్బందిని షిఫ్టుల వారీగా నియమించాలని స్పష్టం చేశారు.

విద్యుత్, రోడ్లు-భవనాలు, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్య, పోలీసు, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేయాలని, జేసీబీలు, జనరేటర్లు, చెట్లు తొలగించే పరికరాలు, అంబులెన్సులు, మందులు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల భవనాల భద్రతను పరిశీలించాలని, రేషన్ సరుకుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలు, ఎన్నికల సామగ్రి భద్రత, రవాణా ఏర్పాట్లను ముందుగానే పరిశీలించాలని తెలిపారు. తుఫాను సహాయక చర్యలకు ఎన్నికల విధులు ఆటంకం కలగకుండా అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని ఆదేశించారు. ప్రజలు వాతావరణ హెచ్చరికలను గమనిస్తూ అధికారుల సూచనలు పాటించాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే కంట్రోల్ రూమ్‌లకు సమాచారం అందించాలని కలెక్టర్ కోరారు.

**తుఫాను అత్యవసర కంట్రోల్ రూమ్ నంబర్లు:**

- జిల్లా కలెక్టరేట్, రంపచోడవరం: 1800-425-4225
- చింతూరు సబ్ కలెక్టర్ కార్యాలయం: 9490026397, 8121729228
- రంపచోడవరం సబ్ కలెక్టర్ కార్యాలయం: 08864-243561

జిల్లాలోని అన్ని తహసీల్దార్ కార్యాలయాల కంట్రోల్ రూమ్ నంబర్లను ప్రజలకు తెలియజేసి, అత్యవసర సేవలు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

# భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలి...

## జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్

**కాకినాడ రూరల్,అక్టోబరు 25,ప్రభాతవార్త.** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఈ నెల 27, 28 తేదీలలో కాకినాడ జిల్లా లోని తీర ప్రాంతాలతో పాటు ఇతర మండలాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించినట్లు జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ ఆదివారం తెలిపారు. తుఫాను నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిత్యావసర సరుకులు, ఇంధనం,వంట గ్యాస్‌కు కొరత రాకుండా పటిష్టమైన ముందస్తు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.భారీ వర్షాల కాలంలో ఇంధన సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా జిల్లాలోని అన్ని పెట్రోల్ బంకుల్లో పెట్రోల్, డీజిల్ నిల్వలు తగినంతగా ఉండేలా పరిశీలించి, అవసరమైన చోట నిల్వల చేయాలని బంకుల యజమానులకు ఆయన స్పష్టం చేశారు. వర్షాల సమయంలో బంకులు 24 గంటలూ నిరంతరం పనిచేసేలా షిఫ్టుల వారీగా సిబ్బందిని కేటాయించాలన్నారు. అలాగే విద్యుత్ అంతరాయం ఏర్పడినప్పుడు ఇబ్బంది లేకుండా జనరేటర్లు ఎప్పుడూ సిద్ధంగా ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. వంట గ్యాస్ ఏజెన్సీలు తగినన్ని సిలిండర్లను ముందుగానే సమకూర్చుకోవాలని, పెండింగ్‌లో ఉన్న గ్యాస్ డెలివరీలను రెండ్రోజుల్లో పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. సాధారణ సరఫరాతో పాటు అదనంగా మరో లోడ్ సిలిండర్లను అందుబాటు లో ఉంచాలన్నారు. అలాగే రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేసే సరుకులు వర్షపు నీటితో తడిచిపోకుండా తగు రక్షణ చర్యలు తీసుకోవాలని, వృద్ధులు, దివ్యాంగులకు అవసరమైన సరుకులను వర్షం లేని సమయాల్లో ఇంటింటికీ డెలివరీ చేయాలని డీలర్లను ఆదేశించారు. భారీ వర్షాల దృష్ట్యా పౌర సరఫరాల శాఖ డిప్యూటీ తహశీల్దార్లు ఎవరూ సెలవులు పెట్టరాదని, తమ మండల కేంద్రాల్లోనే అందుబాటులో ఉండి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ స్పష్టం చేశారు. నిత్యావసరాలు, ఇంధన లభ్యతపై ఎప్పటికప్పుడు సమీక్షలు జరుపుతూ, ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే జిల్లా పౌర సరఫరాల అధికారికి లేదా తన దృష్టికి తీసుకురావాలని జేసీ అధికారులను ఆదేశించారు.

# గిరిజన గ్రామాలకు రహదారుల సమస్యలు తీరేదెప్పుడో





ఆర్. అండ్. బి. శాఖ, పంచాయితీరాజ్ ప్రాజెక్ట్, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖల సమస్యలు....

రాజవొమ్మంగి, అక్టోబర్ 25, ప్రభాతవార్త

రాజవొమ్మంగి మండలంలో రహదారులు సమస్యలకు దశాబ్దాలు గడుస్తున్నా పరిష్కారానికి నోచుకోవడం లేదు. గిరిజన సంక్షేమం, పంచాయితీరాజ్ ప్రాజెక్ట్ విభాగం, ఆర్ అండ్ బి. మూడు శాఖలు వారి పరిధిలో రోడ్ల సమస్యలపై దృష్టిని సారించాలి. ఆర్ అండ్ బి శాఖ పరిధిలో దూసరపాము జంక్షన్ నుండి కిర్రాబు పంచాయితీ బోయపాడు వరకూ ఉన్న రోడ్డులో రోడ్డుకు ఇరుప్రక్కల తుప్పలు తొలగించి నెల్లిమెట్ల.. నెల్లిమెట్ల కాలువ వద్ద వంతెన ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రతీ వర్షాకాలంలో ఇక్కడ వాగు పొంగి ఐదు పంచాయితీల్లో గల 20 గ్రామాల వారు వర్షాలు తగ్గే వరకూ ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కింద్ర నుండి బోయపాడు వరకూ రోడ్డు పరిస్థితిలో కొత్తగా రోడ్లు వేయాల్సి ఉంది.

పంచాయితీరాజ్ ప్రాజెక్ట్ విభాగంలో లబ్బర్తి నుండి మొల్లిమెట్ల మీదుగా రాజవొమ్మంగి వరకూ 15 సం. లుగా రాళ్లు లేచి అధ్వానంగా ఉంది. 20 గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి వెళ్ళడానికి ఈ రహదారి అత్యవసరంగా చెప్పవచ్చు. ఇదే శాఖలో జడ్డంగి ఆర్ అండ్ బి రోడ్డు నుండి ఎ.వనకరాయి, వెంకటనగరం, లోతా వారి వీధి వరకూ 6 కి. మీ రోడ్డు వేస్తే చికిలింత, వంచంగి, మారేడుబాక పంచాయితీలకు చెందిన 20 గ్రామాల వారు సకాలంలో వైద్య సేవలకు జడ్డంగి పి. హెచ్. సి కి చేరుకోవచ్చు. విద్య, నిత్యావసరాలు, మౌలిక సౌకర్యాలు 10 కి. మీ. ప్రయాణం తగ్గుతుంది. వట్టిగడ్డ హైవే నుండి ఎర్రంపాడు గ్రామ శివారు వరకూ మధ్యలో కాలువ ఉంది. ఈ రోడ్డు కూడా ఆగిపోయింది. గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ పరిధిలో రాజవొమ్మంగి శాంతి నగర్ నుండి వయ్యాడ మీదుగా బొరుగుపల్లి, ఆర్. అండ్. బి. రోడ్డు నుండి డి. భీమవరం రోడ్డు, జడ్డంగి నుండి చిన్నయ్యపాలెం మీదుగా సింగంపల్లి రోడ్డు, లోదొడ్డి నుండి కిండంగి , లోదొడ్డి నుండి పూదేడు రహదారులు ఉపాధిహామీ నిధులతో గత ప్రభుత్వంలో మంజూరై అసంపూర్తిగా మిగిలిపోయాయి. కొమరాపురం నుండి వాతంగి మీదుగా బట్టావారి వీధి, లోదొడ్డి వరకూ 12 సం. క్రితం వరకూ వేసిన బి. టి. రహదారికి కనీసం మరమ్మత్తులకు నోచుకోలేదు. గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ వేయాల్సిన రహదారుల్లో ఇంకా ఉన్నాయి. దుర్గానగర్ నుండి మద్దిబంధల మీదుగా వనకరాయి రోడ్డు, చికిలింత నుండి పెదగర్రంగి రోడ్డు, చికిలింత నుండి పెదరెల్లంగిపాడు మీదుగా వాతంగి రోడ్డు, కొండలింగంపర్తి నుండి జి. కొత్తపల్లి రోడ్డు, వంచంగి ఆర్ అండ్ బి రోడ్డు నుండి కోసూరిమకాలు రోడ్డు సమస్యలు పరిష్కారం కావాల్సి ఉంది.



# ఉప్పలంక మత్స్యకారుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

**అటవీ శాఖ అధికారి వరప్రసాద్ తీరుపై మత్స్యకారుల నిరసన**



**కాకినాడ రూరల్, అక్టోబర్ 25(ప్రభాతవార్త):**లి కాకినాడ రూరల్ నియోజకవర్గం కరప మండలం ఉప్పలంక గ్రామ మత్స్యకారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని మత్స్యకారులు డిమాండ్ చేశారు. ఆదివారం సాయంత్రం అటవీ శాఖ అధికారి వరప్రసాద్ తీరును నిరసిస్తూ, ఆయన వేధింపులను అరికట్టాలని నినాదాలు చేశారు. తమ పూర్వీకుల కాలం నుంచి చేపలు, పీతలు, నత్తలు తదితర సముద్ర ఉత్పత్తులను విక్రయిస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నామని మత్స్యకారులు తెలిపారు. అయితే, తాము సేకరించిన ఉత్పత్తులను నిర్దిష్ట వ్యక్తులకే విక్రయించాలని ఒత్తిడి చేస్తున్నారని, అందుకు అంగీకరించకపోతే బోట్లు సీజ్ చేస్తామని బెదిరిస్తున్నారని ఆరోపించారు. మార్కెట్ ధరలకు అనుగుణంగా తమకు నచ్చిన కొనుగోలుదారులకు ఉత్పత్తులను విక్రయించుకునే స్వేచ్ఛ కల్పించాలని కోరారు. ఉన్నతాధికారులు స్పందించి తమ సమస్యలపై సమగ్ర విచారణ జరిపి, న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. తమ జీవనోపాధికి ఆటంకాలు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# సమన్వయంతో ఎన్నికల విధులు నిర్వహించాలి..

## జిల్లా ఎన్నికల పరిశీలకురాలు ప్రశాంతి...



**అంబాజీపేట,అక్టోబర్ 25,(ప్రభాతవార్త):** మండల పరిషత్ ఎన్నికల్లో భాగంగా సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేస్తూ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎన్నికల పరిశీలకురాలు ఎం.ప్రశాంతి సూచించారు. మండలంలోని ముక్కామల ప్రాథమిక పాఠశాలలో ఉన్న పోలింగ్ కేంద్రాన్ని ఆమె ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రశాంతి మాట్లాడుతూ ఎన్నికల విధుల నిర్వహణలో అధికారులు,సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మండలంలో అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి వాటిపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. మండల ఎన్నికల అధికారిణి జి.లక్ష్మీబాయి, సహాయాధికారిణి,ఎంపీడీఓ బి.మమత,తహసీల్దార్ బి.చినబాబు,డిప్యూటీ ఎంపీడీఓ కంచి శ్రీనివాస్,ఎస్ఎస్టి టీం మెంబర్స్ అడపా శ్రీ వెంకటకృష్ణ,కె.ధర్మప్రసాద్, ఆర్ఐ కె. ఏడుకొండలు, పంచాయతీ కార్యదర్శి లావణ్య, వీఆర్వో కోమలి,సచివాలయ ఉద్యోగులు ఆమె వెంట ఉన్నారు.

# భూ వివాదంలో కత్తితో దాడి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాం డి.ఎస్.పి అశ్రఫ్ అలీ





**అడ్డతీగల, అక్టోబర్ 25, ప్రభాతవార్త** పోలవరం జిల్లా అడ్డతీగల పోలీస్ స్టేషన్ పరిధిలోని స్వామియే శరణమయ్యప్ప డిఎస్పి అశ్రఫ్ అలీ మీడియాతో మాట్లాడుతూ బుజ్జి బాబు బొంగరాలపాలెం గ్రామం శివారులో భూ వివాదం కారణంగా చోటుచేసుకున్న ఘర్షణలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. యర్రమల్లి శ్రీరామకృష్ణారావుకు చెందిన 18.49 ఎకరాల భూమిని తిమ్మాపురం గ్రామానికి చెందిన సేవా రత్నరాజు సేవా పెద వీరాజు గత కొంతకాలంగా ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తుండగా, ఈ వివాదంపై హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలై ప్రస్తుతం విచారణలో ఉంది. కోర్టు ఆదేశాల మేరకు భూమి రీ-సర్వే నిమిత్తం అడ్డతీగల సర్వేయర్ నుండి సమాచారం అందడంతో అక్టోబర్ 24న ఉదయం శ్రీరామకృష్ణారావు తిమ్మాపురం గ్రామానికి చేరుకుని, బొమ్మిడి వీణ భారతి, రెవెన్యూ డిపార్ట్‌మెంట్ సర్వేయర్ మరియు విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్ తో కలిసి వివాదాస్పద భూమి వద్దకు వెళ్లారు. ఉదయం 10:00 గంటలకు సర్వే ప్రారంభమవుతుండగా, నిందితులు అక్కడికి వచ్చి గొడవకు దిగి శ్రీరామకృష్ణారావుపై, వీణ భారతిపై పదునైన కత్తులతో తీవ్రంగా దాడి చేశారు. ఈ దాడిలో తీవ్ర రక్తగాయాలైన బాధితులను స్థానికులు అడ్డతీగల ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. బాధితుల ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి, పరారీలో ఉన్న నిందితులను అక్టోబర్ 25న అరెస్ట్ చేసినట్లు డిఎస్పి అశ్రఫ్ ఆలీ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సీఐ గజేంద్రకుమార్, ఎస్సై బి. వినోద్ పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాలు నివారణకు జాగ్రత్తలను పాటించాలి.. ఎస్. ఐ. షరీఫ్

**రాజవొమ్మంగి, అక్టోబర్ 25, ప్రభాతవార్త** రోడ్డు ప్రమాదాలు నివారణకు




ప్రతీ ఒక్కరూ తగు జాగ్రత్తలను పాటించాలని రాజవొమ్మంగి ఎస్. ఐ. షరీఫ్ అన్నారు. ఆదివారం రాత్రి దూసరపాము పంచాయితీ దూసరపాము గ్రామంలో రాజవొమ్మంగి ఎస్. ఐ. షరీఫ్ ఆధ్వర్యంలో అపురేషన్ త్రిశూల్ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్. ఐ. షరీఫ్ మాట్లాడుతూ బాల్య వివాహాలు నేరమన్నారు. గంజాయి సాగు, అమ్మడం, రవాణాకు సహకరించడం కూడా నేరమన్నారు. ప్రతీ ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ను దరించాలన్నారు. మైనర్లకు వాహనాలను ఇవ్వవద్దన్నారు. ప్రతీ వాహనాదారులు రికార్డులను ప్రయాణ సమయంలో వెంట ఉండాలన్నారు.. ఈకార్యక్రమంలో ఎస్. ఐ. షరీఫ్, సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

# వైభవంగా దుర్గమ్మ ప్రతిష్ఠా మహోత్సవం

**మామిడికుదురు.అక్టోబర్25(ప్రభాతవార్త)** పెదపట్నంలంక గ్రామం లో



కొలువై ఉన్న కనకదుర్గమ్మ అమ్మవారి 34వ ప్రతిష్ఠా మహోత్సవం ఆదివారం వైభవోపేతంగా జరిగింది. దీనిలో భాగంగా అమ్మవారికి ఘటాభిషేకం ఘనంగా నిర్వహించారు. భారీ సంఖ్యలో మహిళలు ఈ పూజల్లో కర్తలుగా పాల్గొన్నారు. వేద మంత్రోచ్ఛారణల నడుమ అమ్మవారి ఆలయం వద్ద గణపతి పూజ, పుణ్యాహవాచనం, కలశ పూజ, నవగ్రహారాధన, నక్షత్ర ఆరాధన తదితర పూజలను ఘనంగా నిర్వహించారు. అనంతరం మేళతాళాలు, బాణసంచా కాల్పుల నడుమ ఊరేగింపుగా వైనతేయ గోదావరి నదికి వెళ్ళారు. అక్కడ గోదావరి నదీ తీరంలో గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు జరిపించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహానికి వైనతేయ గోదావరి నదిలో చక్రస్నానం చేయించారు. అనంతరం గోదావరి నది నుంచి ముత్తైదువులు అమ్మవారి ఆలయానికి ఘటాలతో నదీ జలాలు తీసుకువచ్చారు. ఈ నదీ జలాలతో అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. దీనితో పాటు పంచామృతాలతో అమ్మవారిని అభిషేకించారు. తదుపరి కనకదుర్గమ్మకు కుంకుమార్చన, లలితా హోమం, లలితా పారాయణం తదితర పూజలను వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ప్రతిష్ఠా మహోత్సవాల సందర్భంగా ఆలయం భక్తులతో కోలాహలంగా మారింది. పలు రకాల పుష్పాలతో దివ్యాలంకార శోభితమైన తేజస్సుతో అమ్మవారు భక్తులకు కనువిందుగా దర్శనమిచ్చారు.

# వద్దిపర్రులో వైసీపీకి షాక్..టీడీపీలో చేరిన 25 కుటుంబాలు..

## -కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే సత్యానందరావు...



**ఆత్రేయపురం: అక్టోబర్ ,25,(ప్రభాత వార్త).** మండలంలోని వద్దిపర్రు గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువతతో పాటు 25 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరాయి. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వారికి పసుపు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పలువురు టీడీపీలో చేరుతున్నారని తెలిపారు. వద్దిపర్రు గ్రామ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం, తగిన ప్రాధాన్యత కల్పిస్తామని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ జుజ్జువరపు శ్యామల, హరిబాబు, ముళ్ళపూడి భాస్కరరావు, చిటికెన సత్యనారాయణ, గంటి నాగేశ్వరరావు, వజ్ర కుమార్, దండు సీతారామరాజు, బంగార్రాజు, గోపాల రాజు, ప్రవీణ్‌తో పాటు పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# పాపికొండల విహారయాత్రకు మరోసారి బ్రేక్

## -తుఫాన్ ప్రభావంతో రేపటి నుంచి బోట్ల ప్రయాణం నిలిపివేత

**దేవీపట్నం అక్టోబర్ 25 ప్రభాతవార్త:** బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ ప్రభావంతో పాపికొండల విహారయాత్రకు మరోసారి తాత్కాలికంగా బ్రేక్ పడింది. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పర్యాటకుల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ, రేపటి నుంచి పాపికొండల విహారయాత్రను నిలిపివేస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. గోదావరి నదిలో పర్యాటక బోట్ల ప్రయాణానికి వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. తుఫాన్ ప్రభావం తగ్గి, పరిస్థితులు సాధారణ స్థితికి చేరుకున్న తర్వాత విహారయాత్ర పునఃప్రారంభంపై అధికారులు నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. కాగా, ఆదివారం మూడు పర్యాటక బోట్లలో మొత్తం 199 మంది పర్యాటకులు పాపికొండల సందర్శనకు వెళ్లారు. వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో పర్యాటకులు అధికారుల సూచనలు పాటించాలని, ప్రయాణానికి సంబంధించిన తాజా సమాచారాన్ని తెలుసుకున్న తర్వాతే తమ పర్యటనను ఖరారు చేసుకోవాలని సూచిస్తున్నారు.

# తుఫాన్ హెచ్చరిక.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**యానాం,అక్టోబర్ 25 (ప్రభాతవార్త)** తుఫాన్ ప్రభావంతో గంటకు 115--125 కి.మీ. వేగంతో గాలులు, గరిష్ఠంగా 140 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. అక్టోబర్ 27, 28 తేదీల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని సూచిస్తున్నారు. ప్రజలు తాగునీరు, ఆహారం, మందులు వంటి అత్యవసర వస్తువులను సిద్ధంగా ఉంచుకోవాలి. అధికారులు సూచించినప్పుడు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలి. సముద్రతీరాలు, లోతట్టు ప్రాంతాలకు దూరంగా ఉండాలి. తెగిపడిన విద్యుత్ తీగల వద్దకు వెళ్లకుండా, వదంతులను నమ్మకుండా అప్రమత్తంగా ఉండాలి. అత్యవసర పరిస్థితుల్లో 112 నంబర్‌కు కాల్ చేయాలని సూచిస్తున్నారు.

# జగ్గంపేట మండలం జె కొత్తూరులో టీడీపీ ఎంపీటీసీగా సైనం రామలక్ష్మి శ్రీను ఏకగ్రీవం:



**జగ్గంపేట అక్టోబర్ 25 (ప్రభాతవార్త )** జగ్గంపేట మండలం జె కొత్తూరు గ్రామంలో తెలుగుదేశం పార్టీకి ఘన విజయం దక్కింది. ఎంపీటీసీ స్థానానికి కూటమి పార్టీల బలపరిచిన తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ చేసిన సైనం రామలక్ష్మి శ్రీను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు .ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సుపరిపాలన, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వం, జగ్గంపేట శాసనసభ్యులు, టీటీడీ బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ, కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ ఆశీస్సులు, కృషితోనే ఈ ఏకగ్రీవం సాధ్యమైందని నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఎంపీటీసీగా ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా సైనం రామలక్ష్మి శ్రీను మాట్లాడుతూ, తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్న జె కొత్తూరు గ్రామ ప్రజలకు, మద్దతు తెలిపిన కూటమి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, పవన్ కళ్యాణ్ సహకారంతో, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ ఆశీస్సులతో జె కొత్తూరు గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. గతంలో జె కొత్తూరు గ్రామానికి ఉప సర్పంచ్ గా సేవలందించారు. ఈ ఏకగ్రీవ ఎన్నికతో జె కొత్తూరు గ్రామంలో కూటమి బలం మరోసారి రుజువైందని, గ్రామ ప్రజలు కూటమి ప్రభుత్వంపై ఉంచిన నమ్మకానికి ఇదే నిదర్శనమని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు, గ్రామ పెద్దలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని సంబరాలు జరుపుకున్నారు.

# పెనికిలపాడు శివారులో నాటు సారా బట్టీలపై దాడులు



**దేవీపట్నం అక్టోబర్ 25 ప్రభాతవార్త:** దేవీపట్నం మండలం మంటూరు పంచాయతీ పెనికిలపాడు గ్రామ శివారులో దేవీపట్నం ఎస్సై రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 100 లీటర్ల ఊటను ధ్వంసం చేసి, 8 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా నాటు సారా తయారీ, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

# బుర్రకథలతో గ్యాస్ పైప్‌లైన్ భద్రతా సందేశం



**రామచంద్రపురం, అక్టోబరు 25 (ప్రభాతవార్త):** గెయిల్ లిమిటెడ్‌కు చెందిన ఆర్.ఓ.యూ. గ్యాస్ పైప్‌లైన్ వెంబడి ఉన్న గ్రామాల్లో భద్రతా నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు శుక్రవారం బుర్రకథ కార్యక్రమాలు నిర్వహించారు. రామచంద్రపురం కళాబృందానికి చెందిన రాము,కృష్ణ, శ్రీనివాసరావు బృందాలు కొవ్వూరు మండలం రావూరుపాడు,దేవరపల్లి మండలం కొండగూడెం,చాగల్లు మండల కేంద్రంలో ప్రదర్శనలు ఇచ్చి ప్రజలను చైతన్యపరిచాయి. ఈ సందర్భంగా గ్యాస్ పైప్‌లైన్ ప్రాధాన్యం, పరిసరాల్లో పాటించాల్సిన భద్రతా నిబంధనలు, సంబంధిత అధికారుల అనుమతి లేకుండా తవ్వకాలు చేపట్టకూడదనే అంశాలను బుర్రకథల ద్వారా వివరించారు. పైప్‌లైన్ వద్ద గ్యాస్ లీకేజీ లేదా ఇతర అసాధారణ పరిస్థితులు గుర్తిస్తే వెంటనే గెయిల్ టోల్‌ఫ్రీ నంబరు 15101కు సమాచారం అందించాలని గ్రామస్తులకు సూచించారు.

# కపిలేశ్వరపురం మండలంలో రానున్న నాలుగు రోజుల పాటు తీవ్రమైన తుఫాను ప్రభావం

**మండపేట అక్టోబర్ 25,(ప్రభాతవార్త)** కపిలేశ్వరపురం మండలంలో రానున్న నాలుగు రోజుల పాటు తీవ్రమైన తుఫాను ప్రభావం ఉంటుందని, ప్రజలందరూ అత్యంత అప్రమత్తంగా ఉండాలని మండల తహసీల్దార్ ఎస్. సుబ్బారావు ఒక ప్రకటనలో హెచ్చరించారు. భారత వాతావరణ శాఖ (×వీణ) హెచ్చరికల ప్రకారం, ఈ నెల 26 నుండి 29 వరకు మండలంలో భారీ వర్షాలతో పాటు, గంటకు 100 నుండి 120 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని ఆయన తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల యంత్రాంగం ఇప్పటికే అన్ని ముందస్తు చర్యలు చేపట్టిందని, అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ తుఫాను పరిస్థితులను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామని తహసీల్దార్ పేర్కొన్నారు. ప్రజల సౌకర్యార్థం కపిలేశ్వరపురం తహసీల్దార్ కార్యాలయంలో 24/7 కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని వెల్లడించారు. గ్రామ పంచాయితీల ద్వారా కూడా ప్రజలకు తుఫాను జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్పష్టమైన సూచనలు జారీ చేశారు:అత్యవసర పరిస్థితుల్లో మినహా ఎవరూ ఇళ్ల నుండి బయటకు రాకూడదు. చెట్ల కింద, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల సమీపంలో ఉండవద్దు. బలహీనమైన ఇళ్లలో లేదా లోతట్టు ప్రాంతాలలో నివసించే వారు వెంటనే సురక్షిత ప్రాంతాలకు లేదా తుఫాను షెల్టర్లకు వెళ్లాలి. వాతావరణ శాఖ మరియు అధికారులు ఇచ్చే సూచనలను మరియు అధికారిక సమాచారాన్ని మాత్రమే నమ్మాలి, వదంతులు నమ్మవద్దు. తుఫాను సమయంలో ప్రజల భద్రత దృష్ట్యా ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలగాలని, ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తహసీల్దార్ భరోసా ఇచ్చారు. ఈ సమాచారాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లడంలో పత్రికా మిత్రులు, గ్రామ నాయకులు, స్వచ్ఛంద సంస్థలు సహకరించాలని కోరారు. అత్యవసర సహాయం లేదా సమాచారం కోసం ప్రజలు కింది నెంబర్లను సంప్రదించవచ్చు:కంట్రోల్ రూమ్: 08855 225457డిప్యూటీ తహసీల్దార్: 9848149625తహసీల్దార్: 8008803196

# ఎన్నికల విధులపై ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ...



**రాజవొమ్మంగి, అక్టోబర్ 25, ప్రభాతవార్త** రాజవొమ్మంగి మండలంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల విధులకు హాజరుకానున్న 83 మంది ఉపాధ్యాయులకు సోమవారం ఒక పూట శిక్షణ ఇవ్వనున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి జి. శ్రీరామమూర్తి తెలిపారు. మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ఈశిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల విధుల నిర్వహణ, బాధ్యతలు, పాటించాల్సిన నిబంధనలపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఎన్నికల విధులకు కేటాయించిన ఉపాధ్యాయు లందరూ శిక్షణకు తప్పనిసరిగా హాజరు కావాలని ఆర్వో సూచించారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు సిబ్బంది విధులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఏఆర్వోలు లోకుల యాదగిరేశ్వరరావు, స్వామి, జోనల్ ఆఫీసర్ కె.వి.వి. సత్యనారాయణదొర పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారు.

## -వైకాపా అభ్యర్థికి బి. ఫారం అందించిన మాజీ ఎమ్మెల్యే పొన్నాడ.



**తాళ్లరేవు, అక్టోబర్ 25( ప్రభాతవార్త):** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారని ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా పోటీ చేస్తున్న వైకాపా ఎంపీటీసీ అభ్యర్థులకు మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ పార్టీ బి. ఫారం లను అందజేశారు. ఈ మేరకు కోరంగి 2 ఎంపీటీసీ అభ్యర్థి సంగాడి శ్రీనివాస్ కు బొడ్డు చిన వెంకటాయపాలెం గ్రామంలో మహాలక్ష్మి ఆలయం వద్ద బి.ఫారం అందించి అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం పెరుగుతున్న నిత్యా వసర ధరలను నియంత్రించడంలో విఫలమైందని అన్నారు. గత ఎన్నికల ముందు చేసిన వాగ్దానాలను, అమలు చేయకపోవడమే కాకుండా పరిపాలనలోను విఫలమైందని తెలిపారు. కూటమి ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా జడ్పీటిసి అభ్యర్థి అంకాడి భాగ్యవతి, నాయకులు అంకాడి అంజిబాబు, వైకాపా మండల పార్టీ అధ్యక్షులు కాదా గోవింద కుమార్, కొపనాతి నాగరాజు, రేకాడి వెంకటేశ్వర్లు, కోరంగి మాజీ ఉపసర్పంచ్ కామాడి భైరవ మూర్తి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# 516ఈ జాతీయ రహదారిపై వెలుగుల కరువు.. ప్రయాణికులకు చీకటి కష్టాలు!

## -జడ్డంగిలో 14 విద్యుత్ స్తంభాల వద్ద దీపాలు వెలగని వైనం సింగంపల్లి, దూసరపాములోనూ అదే పరిస్థితి



**రాజవొమ్మంగి, అక్టోబర్ 25, ప్రభాతవార్త:** రాజవొమ్మంగి మండల పరిధిలోని 516ఈ జాతీయ రహదారిపై రాత్రివేళ విద్యుత్ దీపాలు సక్రమంగా వెలగకపోవడంతో చీకట్లు అలుముకుంటున్నాయి. జడ్డంగి గ్రామంలో జాతీయ రహదారికి ఇరువైపులా ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాల్లో కొన్ని మాత్రమే వెలుగుతుండగా, మరికొన్ని పనిచేయకపోవడంతో రహదారిపై వెలుగు ఒకచోట.. చీకటి మరోచోట అన్నట్లుగా పరిస్థితి మారింది. ముఖ్యంగా జడ్డంగిలో 14 విద్యుత్ స్తంభాల వద్ద దీపాలు వెలగకపోవడం సమస్య తీవ్రతను తెలియజేస్తోంది. సింగంపల్లి, దూసరపాము ప్రాంతాల్లోనూ విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో రాత్రివేళ ఆయా ప్రాంతాలు అంధకారంలో మునిగిపోతున్నాయి. జాతీయ రహదారిపై రాత్రి వేళల్లో వాహనాల రాకపోకలు సాగుతుండగా, వీధి దీపాలు సరిగా వెలగకపోవడం వాహనదారులకు ఇబ్బందికరంగా మారుతోంది. తగిన వెలుతురు లేకపోవడంతో రహదారిపై ఎదురుగా వచ్చే వాహనాలు, రహదారి పక్కన ఉన్న పరిస్థితులను గుర్తించడం కష్టమయ్యే అవకాశం ఉంది. దీంతో ప్రమాదాల ముప్పు పెరిగే ఆందోళన వ్యక్తమవుతోంది. శీతాకాలం సమీపిస్తుడంతో మంచు పెరిగి చీకట్లో ఎదురుగా వచ్చే వాహనాలు కన్పించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. రహదారిని వినియోగించే ప్రయాణికులు, స్థానిక ప్రజల భద్రత దృష్ట్యా విద్యుత్ దీపాల నిర్వహణపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. జాతీయ రహదారిపై దీపాలు ఏర్పాటు చేయడమే కాకుండా, అవి నిరంతరం పనిచేసేలా పర్యవేక్షించాల్సిన బాధ్యత కూడా సంబంధిత అధికారులపై ఉంది. జడ్డంగితో పాటు సింగంపల్లి, దూసరపాము ప్రాంతాల్లో వెలగని దీపాలను గుర్తించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. రాత్రివేళ ప్రయాణం సురక్షితంగా సాగేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# నామినేషన్ పత్రాల భద్రతకు పటిష్ట బందోబస్తు



**అడ్డతీగల, అక్టోబర్ 25, ప్రభాతవార్త** మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద నామినేషన్ పత్రాలు, ఎన్నికలకు సంబంధించిన కీలక పత్రాలను భద్రపరిచిన నేపథ్యంలో పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీఐ గజేంద్ర కుమార్ తెలిపారు. ఎన్నికల పత్రాల భద్రతను దృష్టిలో ఉంచుకుని తగిన పోలీసు బందోబస్తు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

# రాబోయేది హిందూ శతాబ్దం అప్పాల ప్రసాద్

## -కంబాలచెరువు సెంటర్‌లో ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ



**రాజమహేంద్రవరం, అక్టోబరు 25, ప్రభాత వార్త,** 2047 నాటికి స్వాతంత్ర్య భారతానికి వందేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో రాబోయేది హిందూ శతాబ్దమని సమరసత సేవా సమితి తెలుగు రాష్ట్రాల కార్యవాహ్ అప్పాల ప్రసాద్ అన్నారు. రాజమహేంద్రవరం కంబాలచెరువు సెంటర్‌లో ఆదివారం మహారాష్ట్ర సంప్రదాయ డోలు తాషా వాయిద్యాలు, జై భవాని, వీర శివాజీ నినాదాల మధ్య ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ఆయన రిమోట్ ద్వారా ఆవిష్కరించారు. సభలో అప్పాల ప్రసాద్ మాట్లాడుతూ, శివాజీ స్ఫూర్తితో యువత పరాక్రమవంతులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. భారతదేశం తిరిగి ప్రపంచంలో తన పూర్వ వైభవాన్ని సాధిస్తోందన్నారు. మహారాష్ట్ర ఎమ్మెల్యే సుహాస్ అనీల్‌రావు బాబర్ మాట్లాడుతూ, శివాజీకి ఆంధ్రప్రదేశ్‌తో అనుబంధం ఉందన్నారు. ఉదయం విగ్రహం వద్ద శాంతి హోమం నిర్వహించగా, మధ్యాహ్నం మహారాష్ట్ర రాయగడ నుంచి తీసుకొచ్చిన జ్యోతిని దేవీచౌక్ అమ్మవారి పాదాల వద్ద ఉంచి సభాస్థలికి తీసుకొచ్చారు. శ్రీరామ ఉత్సవ సమితి అధ్యక్షుడు పతివాడ రామరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు 6లో

# వైభవంగా శ్రీ విజయ భేతాళస్వామి వాహన మహోత్సవం,తీర్థం..

-పోటెత్తిన భక్తులు.. భారీగా పోలీసు బందోబస్తు..



**అంబాజీపేట, అక్టోబర్ 25,(ప్రభాతవార్త)** శ్రీ విజయ బేతాళస్వామి వాహన మహోత్సవం,తీర్థం అంబాజీపేటలో ఆదివారం రాత్రి వైభవంగా జరిగింది.14 పాలెంలకు చెందిన 15 రకాల వాహనమూర్తులు పురవీధుల్లో ఊరేగుతూ శ్రీనివాసనగర్ లోని శ్రీ విజయ బేతాళస్వామి ఆలయం వద్దకు చేరుకున్నాయి. అంబాజీపేట- మాచవరం శ్రీ శెట్టిబలిజ అభ్యుదయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ విజయ బేతాళస్వామి వాహన మహోత్సవం ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకూ అట్టహాసంగా,కన్నుల విందుగా సాగింది.ముందుగా శ్రీనివాసనగర్ లో వేంచేసియున్న శ్రీ విజయ బేతాళస్వామి ఆలయం వద్ద నుండి ఈ సంబరాలు ప్రారంభమయ్యాయి. 14 పాలెంలలోని ఉత్సవ నిర్వాహకులు వివిధ దేవతామూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై ఉంచి రంగురంగుల విద్యుత్ దీపాల వెలుగులు, వివిధ రకాల పచ్చిపూలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. మేళతాళాలు,బాజా భజంత్రీలు,డప్పు వాయిద్యాలు, సాంస్కృతిక కార్యక్రమాల తో పురవీధుల్లో ఊరేగించారు. వాహనాల ముందు చేడీ తాళింభానా, కత్తి యుద్ధాలు, అగ్గి బరాటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. యువకులు చేసిన విన్యాసాలు గగుర్పాటుకు గురిచేశాయి. గరగ నృత్యాలు, కొబ్రా, శక్తి వేషాలు పలువురిని ఆకట్టుకున్నాయి. స్థానిక సెంటర్లో పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చారు. తెల్లవార్లు జరిగే ఈ ఉత్సవాల్లో ఎటువంటి ఆవాంఛనీయ సంఘటనలు జరకుండా కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్ పర్యవేక్షణలో పి.గన్నవరం సీఐ రుద్రరాజు భీమరాజు పర్యవేక్షణలో ఎస్ఐ షేక్ సుభాని పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. శ్రీ విజయ బేతాళ స్వామిని వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కోనసీమ పరిసర ప్రాంతాల్లోని ప్రజలు శ్రీ విజయ భేతాళ స్వామి వారిని దర్శించుకున్నారు.అంబాజీపేట- మాచవరం శ్రీ శెట్టిబలిజ అభ్యుదయ సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు దొమ్మేటి వెంకట రామారావు, మట్టపర్తి రాము, ఉత్సవ కమిటీ చైర్మన్ శీలం సత్య అర్జున మోహన్రావు, సంఘ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. వైభవంగా బేతాళస్వామివారి తీర్థం.. అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు.. శ్రీ విజయ బేతాళ స్వామి వారి వాహన మహోత్సవ సందర్భంగా నిర్వహించే తీర్థం ఆదివారం రాత్రి వైభవంగా జరిగింది. అధిక సంఖ్యలో మహిళా భక్తుల విచ్చేసి తీర్థంలో తిరుగుతూ వాహనాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించారు. ఈ సందర్భంగా నాలుగు రోడ్ల కూడలిలలో ఏర్పాటు చేసిన స్టేజి ప్రోగ్రామ్స్ విశేషంగా ఆకట్టుకున్నాయికొలువుతీరిన వాహనాలివే:శ్రీనివాసనగర్, పెచ్చెట్టివారిపాలెంల నుండి - గరుత్మతుండు,మాచవరం శ్రీరామ్ నగర్- సింహ వాహనం, దొమ్మేటివారిపాలెం- శ్రీకృష్ణుడు, స్త్రీల ఆస్పత్రి దొమ్మేటివారిపాలెం - శ్రీఆంజనేయస్వామి, పోతాయిలంక-శ్రీ ఆంజనేయస్వామి, గంగలకుర్రు మలుపు-శ్రీ విజయ గణపతి, మాచవరం ఇటికాలమ్మ గుడి నుండి-హంస వాహనం, కొత్తపాలెం- హంస వాహనం, చప్పిడివారిపాలెం- శ్రీషిరిడిసాయిబాబా, గుత్తులవారిపాలెం- సింహ వాహనం,నందంపూడి- శ్రీరాజరాజేశ్వరిదేవి, శ్రీనివాసనగర్- ఏనుగు, మాచవరం డామ్ సెంటర్ -వీరాంజనేయస్వామి, పెచ్చెట్టివారిపాలెం-లక్ష్మి గణపతి వాహనాలు కొలువుదీరాయి.

# పొత్తుల పేరుతో కూనవరం జడ్పీటీసీ సానాన్ని వేరే పార్టీకి కేటాయిస్తే అంగీకరించేది లేదు

**- మండల టిడిపి ముఖ్య నేతలు - మండలంలోని 16 పంచాయతీల పార్టీ ప్రతినిధుల తీర్మానం**



**కూనవరం, అక్టోబర్ 25, ప్రభాతవార్త :** పొత్తుల పేరుతో, లేక ఇతర కారణాల వల్ల గాని కూనవరం జడ్పీటిసి స్థానాన్ని వేరే పార్టీకి కేటాయిస్తే ఎట్టి పరిస్థితులలోనూ అంగీకరించేది లేదని, మండల తెలుగుదేశం పార్టీకి చెందిన 16 గ్రామ పంచాయతీలకు చెందిన ప్రతినిధులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఆదివారం జగ్గవరం గ్రామంలో జరిగిన తెలుగుదేశం పార్టీ సమావేశంలో ఈ నిర్ణయాన్ని తీసుకున్నట్లు పత్రికలకు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జడ్పీటిసి అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన పొడియం అప్పారావును భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని కూడా వారు తెలిపారు. క్షేత్రస్థాయిలో పార్టీ కోసం నిరంతరం శ్రమిస్తున్న పొడియం అప్పారావు అభ్యర్థిత్వాన్ని మండలంలోని అన్ని వర్గాల వారు మద్దతు ఉందని వారు తెలిపారు. తెలుగుదేశం పార్టీ బి.ఫారం ఇచ్చిన ఇవ్వకపోయినా స్వతంత్ర అభ్యర్థిగా నైనా పోటీ చేయడం జరుగుతుందన్నారు. మండలంలోని పార్టీ ఉనికిని, క్యాడర్ మనోభావాలను దృష్టిలో ఉంచుకొని అధిష్టానం సానుకూలంగా నిర్ణయం తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మండల ముఖ్య నేతలు పాల్గొన్నారు. మండల తెలుగుదేశం అధ్యక్షులు ఎడవల్లి భాస్కరరావు, మాజీ మండల అధ్యక్షులు గడేసుల ప్రేమ్ చంద్, ఉపాధ్యక్షులు చలకాని ఉమ, మడకం చిన్ని, మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ సోముక సత్యనారాయణ, బీసీ సెల్ అధ్యక్షులు నాగరాజు, ఎస్టీ సెల్ అధ్యక్షులు కరక సర్వేశ్వరరావు, వెల్లంకి వెంకన్న, ఎస్.కె రసూల్, కన్నారావు, యూనిట్ ఇన్చార్జులు వెంకటేశ్వర్లు, రవి, ఎంపీటీసీ అభ్యర్థులు మరియు 16 పంచాయతీల గ్రామ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు ఈ సమావేశం టిడిపి మండల ప్రధాన కార్యదర్శి పోడియం అప్పారావు ఆధ్వర్యంలో జరిగింది.

# రాజమహేంద్రవరం రూరల్ లో స్థానిక సంస్థల ఎన్నికలను..- ప్రశాంత ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా ప్రజలు రాజకీయ నాయకులు సహకరించాలి...

**-దక్షిణ మండలం డీఎస్పీ ఎ శివ ప్రియ**



కడియం అక్టోబర్ 26 తర్వాత వార్త :-

స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని, ప్రజలందరూ ఎటువంటి భయాందోళనలకు గురికాకుండా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా, ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగే ఉద్దేశంతో తూర్పుగోదావరి జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఉత్తర్వులు ప్రకారం దక్షిణ మండలం డీఎస్పీ ఎ శివ ప్రియ ఆధ్వర్యంలో కడియం పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఎ.వెంకటేశ్వరరావు, ధవలేశ్వరం పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ టి గణేష్, కడియం పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ బి దుర్గాప్రసాద్, పిడిఎల్ ప్రసన్న , టూ టౌన్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ శ్యాంసుందర్, దక్షిణ మండల సిబ్బందితో కలిసి కడియం మండలంలో చైతన్య నగర్ లో ఆదివారం తెల్లవారుజామున 5 గంటలకు సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన డ్రోన్, ఫేస్ ట్రాకర్, ఫింగర్ ప్రింట్ డివైసెస్ ద్వారా నిర్వహించిన కార్డెన్ సెర్చ్ లో భాగంగా చైతన్య నగర్ లో ఉన్న సస్పెక్ట్స్ ఇతర ట్రబుల్ మాంగర్స్ చెక్ చేసి ఎటువంటి రికార్డ్ లేని 30 ద్విచక్ర వాహనాలను స్వాధీనం పరుచుకున్నాము. అలాగే వివిధ గ్రామాల్లో అవగాహన ర్యాలీని నిర్వహించారు.

# చిన బొడ్డు వాసులకు మాజీ ఎమ్మెల్యే పొన్నాడ భరోసా.

**తాళ్ళరేవు, అక్టోబర్ 25 (ప్రభాతవార్త):** కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం కోరంగి పంచాయతీ బొడ్డు చిన వెంకటాయపాలెం గ్రామానికి చెందిన పెసింగి భైరవ స్వామి(65) కుటుంబం ఇటీవల శ్రీకాళహస్తి తీర్థయాత్రకు వెళ్లగా కావలి రైల్వే స్టేషన్ లో భైరవ స్వామి తప్పిపోయాడు. ఆందోళనలో ఉన్న ఆ కుటుంబ సభ్యులు ఆదివారం విలేకరుల వద్ద తమ ఆవేదనను వ్యక్తం చేశారు. శ్రీకాళహస్తి నుంచి తిరిగి ప్రయాణం అయ్యే క్రమంలో కావలి రైల్వే స్టేషన్ లో తమ తండ్రి భైరవ స్వామి దిగినట్లు, అయితే మళ్లీ తిరిగి రైలు ఎక్కలేదని, అతని కుమార్తె పాలెపు శివ భవాని తెలిపారు. నేటికీ నాలుగు రోజులైనా తన తండ్రి జాడ తెలియలేదని,మా కుటుంబ సభ్యులు ఆ ప్రాంతంలో ప్రయత్నం చేసిన ఆచూకీ దొరకలేదని అన్నారు. కావలి రైల్వే స్టేషన్ లో భైరవ స్వామి ఫోటో ఇచ్చి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. విలేకరుల వద్ద కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్న సమయంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా అటుగా వెళుతున్న మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ వద్ద భైరవ స్వామి కుటుంబ సభ్యులు ఆవేదనతో భైరవ స్వామి ఆచూకీ తెలుసుకోవాలని వేడుకున్నారు. ఈ మేరకు మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ మాట్లాడుతూ కావలి ఎమ్మెల్యే, అక్కడి పోలీసుల సహాయంతో ఆచూకీ తెలుసుకుంటానని భరోసా ఇచ్చారు. కావలి పోలీస్ స్టేషన్ లోనూ ఫిర్యాదు చేయాలని బాధిత కుటుంబ సభ్యులకు తెలిపారు.



# మున్సిపల్ ఎన్నికల బాధ్యులు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, అక్టోబరు25,ప్రభాతవార్త**

మున్సిపల్ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా జనసేన పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎన్నికల నిర్వహణ బాధ్యతలు పలువురు నాయకులకు అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. క్షేత్రస్థాయిలో ఎన్నికల ప్రచారం, అభ్యర్థులు, కార్యకర్తల సమన్వయం, కూటమి భాగస్వాములతో కలిసి ఎన్నికల కార్యాచరణ, పోలింగ్ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, పార్టీ అభ్యర్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా కృషి చేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు. మున్సిపాలిటీ కి ముగ్గురికి చొప్పున మున్సిపాలిటీ బాధ్యతలు అప్పగించారు.

# జనసేనలోకి వైసీపీ మాజీ వైస్ ఎంపీపీ

**రామచంద్రపురం, అక్టోబరు 25 (ప్రభాతవార్త):**రామచంద్రపురం నియోజకవర్గంలో వైసీపీకి చెందిన మాజీ వైస్ ఎంపీపీ శాఖ చంద్రశేఖర్ (బాబి) తన అనుచరులు సుమారు 50 మందితో జనసేనలో చేరారు.చిక్కాల దొరబాబు సమక్షంలో పార్టీలో చేరిన ఆయన.. అనంతరం రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ను మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి సమష్టిగా కృషి చేయాలని మంత్రి సూచించారు. ఎన్నికల వేళ ఈ చేరిక నియోజకవర్గ రాజకీయాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది.






తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం.
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త


# ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుతో పీజీఆర్ఎస్ తాత్కాలిక నిలిపివేత..

**-జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ కీర్తి చేకూరి**



**రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 25,ప్రభాతవార్త**స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్నందున తూర్పుగోదావరి జిల్లాలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని డిసెంబరు 2, వరకు లేదా ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు, ఏది ముందుగా జరిగితే అప్పటివరకు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు.ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు, అధికారుల పర్యవేక్షణ, ఎన్నికల విధుల నిర్వహణ తదితర అంశాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా అధికారులు విధులు నిర్వహించాలని, ఎన్నికల ప్రక్రియను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఎన్నికల ప్రక్రియ పూర్తయిన అనంతరం సంబంధిత ఆదేశాల మేరకు పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

# యస్.యానాంలో టీడీపీలో చేరికలు..



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, అక్టోబరు 25,ప్రభాతవార్త.**ఎస్ యానం గ్రామానికి చెందిన ప్రముఖ వైఎస్ఆర్సీపీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం తెలుగుదేశం పార్టీలో చేరారు.అమలాపురం పట్టణం హౌసింగ్ బోర్డు కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లో శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు,రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు, పార్లమెంట్ సభ్యులు గంటి హరీష్ మాథుర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. టీడీపీలో చేరిన ఓలేటి వెంకటరమణ,లంకె వీరవెంకట సత్యనారాయణ,ఓలేటి శ్రీరామకృష్ణ,ఓలేటి వరప్రసాద్ కు పసుపు కండువాలు కప్పి పార్టీలోకి సాధరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ. ముఖ్యమంత్రి చంద్రబాబు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో రాష్ట్రంలో సాగుతున్న సంక్షేమం, అభివృద్ధికే ప్రజలు పెద్దపీట వేస్తున్నారని కొనియాడారు. పార్టీలో చేరిన వారికి తగిన గుర్తింపు, గౌరవం ఉంటుందని తెలిపారు.ఈ చేరికల కార్యక్రమంలో అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంధం పల్లంరాజు,మాజీ జెడ్పీటీసీ దేశంశెట్టి లక్ష్మీనారాయణ, నాయకులు చిక్కాల గణేష్, లంకే భీమరాజు, అయితాబత్తుల రాజశేఖర్, పళ్లచోళ్ల బుజ్జి, దంగేటి చిట్టిబాబు, ఉలిశెట్టి దొరబాబు, చెరుకూరి రాంబాబు కూటమి ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# తుఫాను హెచ్చరిక నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి..

**-డివిజన్‌లో 14 కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు...-సబ్ కలెక్టర్ శుభం నోక్వాల్**

**రాజమహేంద్రవరంఅర్బన్, అక్టోబరు 25,ప్రభాతవార్త**

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుఫానుగా బలపడే అవకాశం ఉన్న నేపథ్యంలో రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలో ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టినట్లు సబ్ కలెక్టర్ శుభం నోక్వాల్ ఆదివారం తెలిపారు. భారత వాతావరణ శాఖ అంచనాల ప్రకారం అక్టోబరు 26వ తేదీ ఉదయానికి తుఫానుగా, 27వ తేదీ ఉదయానికి తీవ్ర తుఫానుగా, అదే రోజు రాత్రికి అతి తీవ్ర తుఫానుగా మారే అవకాశం ఉందన్నారు. అక్టోబరు 28వ తేదీ ఉదయం బాపట్ల-- విశాఖపట్నం మధ్య ఆంధ్రప్రదేశ్ తీరాన్ని దాటే అవకాశం ఉందని, ఈ సమయంలో గంటకు 115--125 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే ప్రమాదం ఉందని, అప్పుడప్పుడు గాలి వేగం గంటకు 140 కిలోమీటర్ల వరకు చేరవచ్చని పేర్కొన్నారు. ప్రజలు వాతావరణ శాఖ జారీ చేసే తాజా హెచ్చరికలను గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని, తీర ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలు అధికారులు జారీ చేసే సూచనలను తప్పనిసరిగా పాటించాలని సబ్ కలెక్టర్ కోరారు. జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశాలు మేరకు డివిజన్ పరిధిలో ప్రమాదకర ప్రాంతాలను ముందుగానే గుర్తించి, అవసరమైన చోట్ల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. అత్యవసర సేవల సిబ్బందిని సిద్ధంగా ఉంచడంతోపాటు, ప్రజలకు అవసరమైన నిత్యావసర వస్తువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని శు భం నోక్వాల్ పేర్కొన్నారు.తుఫాను పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించేందుకు రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలోని 13 మండలాల తహశీల్దార్ కార్యాలయాలతోపాటు సబ్ కలెక్టర్ కార్యాలయంలో అక్టోబరు 25 నుంచి 29వ తేదీ వరకు 24 గంటల పాటు పనిచేసే కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తుఫానుకు సంబంధించిన సమాచారం, అత్యవసర పరిస్థితులు, ఇతర సమస్యలపై ప్రజలు ఈ కంట్రోల్ రూమ్‌లను సంప్రదించాలని సూచించారు. 24 ఇ 7 కంట్రోల్ రూమ్ నెంబర్ లు....సబ్ కలెక్టర్ కార్యాలయం, రాజమహేంద్రవరం కంట్రోల్ రూమ్ ఫోన్ నంబరు 0883-2442344;తహసిల్దార్ కార్యాలయాల్లో.. అనపర్తి 9441386920, బిక్కవోలు 8886781584, గోకవరం 9491385060, కడియం 9490884561, కోరుకొండ 9154474851, రాజమహేంద్రవరం రూరల్ 9966058666, రాజమహేంద్రవరం అర్బన్ 0883-2940695, రాజానగరం 9393650402, రంగంపేట 9393931667, సీతానగరం 7032310130, మండపేట 9989626869, రాయవరం 9618006344, కపిలేశ్వరపురం 9848149625 నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.తుఫాను ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో అధికారులకు వెంటనే సమాచారం అందించాలని సబ్ కలెక్టర్ సూచించారు. అన్ని సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ తుఫాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని, ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ అవసరమైన అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు.




Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408. RNI No.64863/96, Editor : Damerla Sai Baba, Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps